క్లుప్తంగా

మే 26 నుంచి మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఇల్లెందురూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు మే 26 న ప్రారంభమవుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజును మే 6వ తేదీలోపు చెల్లించాలని సూచించారు. ఒక్కో పేపరుకు రూ.150 చొప్పున, సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ అదనంగా పేపర్‌కు రూ.150 చొప్పున చెల్లించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పాండురంగాపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి

పాల్వంచరూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలను శనివారం ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి తనిఖీ నిర్వహించారు. మండలంలోని పాండురంగాపురం గ్రామంలోని హైస్కూల్ ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ సందర్శించి కేంద్రంలో విద్యుత్ సౌకర్యాలు, ర్యాంప్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం, పీఏఓ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులకు 'గురుకులం'లో సీట్లు



ఎంపికైన విద్యార్థులు

జూలూరుపాడు: గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశ పరీక్షలో జూలూరుపాడు పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సీట్లు సాధించారు. గురుకులంలో ప్రవేశానికి ఎనిమిది మంది పరీక్ష రాయగా.. వంశీకృష్ణ, సింధు, లేఖనాశ్రీ, రిషిత, సనవర్యా, నిఖిల, రామ్‌చరణ్‌లు ప్రతిభ చూపారు. శనివారం విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం గీత, ఉపాధ్యాయులు డి.భాస్కర్, సీతారాములు, స్వర్ణ, విజయలక్ష్మి, పద్మ అభినందించారు. పాఠశాలలోనే 4వ తరగతి విద్యార్థులకు ఆరు నెలలు కోచింగ్ ఇవ్వడం జరిగిందని, విద్యార్థుల ఎంపిక పట్ల హెచ్‌ఎం గీత హర్షం వ్యక్తం చేశారు.

మే 3న మండల సర్వసభ్య సమావేశం

పాల్వంచరూరల్: మండల సర్వసభ్య సమావేశం వచ్చే నెల 3వ తేదీ ఉదయం 10 గంటల నుంచి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.విజయభాస్కర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని ప్రభుత్వశాఖలకు చెందిన ప్రగతి నివేదికలను ఈనెల 25లోగా కార్యాలయంలో సమర్పించాలన్నారు. మండల ప్రాదేశిక సభ్యులు, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

హోం ఓటర్ల గుర్తింపు

పాల్వంచరూరల్: మండలంలో హోం ఓటర్లను గుర్తించినట్లు తహసీల్దార్ వివేక్ శనివారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లోకి రాలేని, 85 సంవత్సరాల వయస్సున్న వృద్ధులు 18మంది ఉన్నారని వీరికి బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ)ల ద్వారా 12 డీఏ ఫారం అందజేసి, వారి సంతకాలను తీసుకున్నట్లు చెప్పారు. ప్రత్యేక పోలింగ్ సిబ్బందిని ఇంటికి పంపించి ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చూస్తామని తెలిపారు.

బాలోత్సవ్ విజేతలకు అభినందనలు



అభినందిస్తున్న శివకుమార్, శంకర్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ పంచాయతీ ఇందిరానగర్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ బాలోత్సవంలో విజేతలైన విద్యార్థులను బాలోత్సవ్ కన్వీనర్ మద్దెల శివకుమార్, కోకన్వీనర్ అల్లి శంకర్ జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం జ్యోతిరాణి, ఉపాధ్యాయులు శౌరి, ఇన్నయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు కళ్యాణి, శ్రీలత, ప్రవంతి, స్వప్న, భాగ్యమ్మ, సురేందర్ పాల్గొన్నారు.









ఇల్లెందులో పక్షులకు నీరు ఏర్పాటు చేసిన దృశ్యాలు, వీధుల్లో ఏర్పాటు చేసిన నీటి డబ్బాల వద్ద దాహం తీర్చుకుంటున్న కుక్కలు

మూగజీవాలకు నీటితొట్లు..

- దాహార్తి తీరిస్తే కుక్కల నుంచి రక్షణ
- కదిలిన మెప్మా యంత్రాంగం
- ఇల్లెందు మున్సిపాలిటీలో కొనసాగుతున్న ప్రక్రియ

సండే స్పెషల్

ఇల్లెందు: వేసవిలో తీవ్రమైన ఎండలు... 45 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత.. దాహంతో అల్లాడుతున్న పక్షులు, కోతులు, కుక్కలు, ఆవులు, గేదెలు.. వాటి దాహార్తి తీర్చేందుకు ఇంటింటా, వీదుల్లో నీటితొట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో మెప్మా యంత్రాంగం పొదుపు సంఘాల సభ్యులతో నీటితొట్లు ఏర్పాటు చేస్తోంది. ఇందుకు వేసవికాలం ముగిసే వరకు తమ ఇళ్లల్లో వృథాగా ఉన్న తొట్లు, డబ్బాలు, బకెట్లలో నీటిని నింపి నీడ ప్రాంతంలో ఉంచుతున్నారు. ఈ ప్రక్రియను పొదుపు సంఘాల సభ్యులకు మెప్మా సిబ్బంది అవగాహన కల్పించారు. వేసవికాలంలో ఎక్కువగా కుక్కలు, కోతులు కాటు వేసే ప్రమాదాలు ఉన్నాయి. ఇందుకు కారణం వేసవిలో ఎండ తీవ్రతకు శరీరం, తల భాగం వేడెక్కి అల్లాడుతుంటాయి. ఇదే తరుణంలో తీవ్ర దాహార్తితో నీడ, ఆహారం లభించక కుక్కలు, కోతులు కోపంతో ఉంటున్నాయి. వాటికి చల్లని నీరు లభిస్తే దాహార్తి తీరుతుంది. కోపం చల్లారే అవకాశం ఉందని పశువైద్యులు, పరిశోధకులు పేర్కొంటున్నారు. ఇక వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని, వాగులు, చెరువులు ఎండిపోయి బావులు, బోర్లు, చేతి పంపులకే పరిమితం అవుతున్న సందర్భాల్లో నీటి లభ్యత లేని కారణంగా దాహం, ఆకలితో నిత్యం అల్లాడే జంతువులలో కుక్కలు, కోతులు ఉంటాయి. వాటికి తాగేందుకు కనీసం చల్లటి నీటిని ఏర్పాటు చేయగలిగితే వాటిలో కోపం తగ్గించే అవకాశం ఉంది. ఇది గమనించి గత ఏడాది నుంచి వేసవిలో నీటి తొట్లు ఏర్పాటు ప్రక్రియ సాగుతోంది. మార్చి నెల నుంచి పట్టణంలో పలు వీధుల్లో ఈ ప్రక్రియకు కొనసాగించాలని మెప్మా యంత్రాంగానికి సూచించారు. పట్టణంలోని 24 వార్డులలో నీటి పలువురు నీటి తొట్లు ఏర్పాటు చేశారు. ఇక పక్షులను రక్షించుకునేందుకు సైతం చెట్ల మీద నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇదే విధానం జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఇంట్లో ఒక తొట్టి ఆరు బయట చెట్ల కింద ఏర్పాటు చేస్తే అటు పశువులు, కుక్కలు, కోతులు దాహం తీర్చుకుంటాయి. ఈ ప్రక్రియ వేసవి వరకు నిరంతరాయం సాగాలి. అప్పుడే జంవుతు మనుషుల మీద దాడులు చేసే అవకాశం తగ్గుతుంది.



పక్షులకు డబ్బాలో నీరు ఏర్పాటు చేస్తున్న మహిళ

బకెట్‌లో నీరు ఉంచుతున్నా..



పట్టణంలోని స్టేషన్ బస్తీకి చెందిన స్వయం సహాక సంఘాల సభ్యులందరం వారం నుంచి ప్రతీఇంట్లో నీటితొట్లు ఏర్పాటు చేసి పశుపక్షాదుల దాహం తీర్చుతున్నాము. దాహంతో అల్లాడే పక్షులు, కుక్కలు, కోతులకు ఉపశమనంగా ఉంటుంది. దాహం తీరితే అవి మనుషుల వెంట పడే ప్రమాదం ఉండదని అవగాహన కల్పించారు.

– సీహెచ్ దేవకుమారి, స్టేషన్ బస్తీ, ఇల్లెందు

మెప్మా సహకారంతో..



మండువేసవిలో నీటి ఎద్దడి కారణంగా పశువులు, పక్షులు, కుక్కలు అల్లాడుతుంటాయి. ఈ క్రమంలో వాటికి కోపం తీవ్రంగా ఉంటుంది. వాటికి ఎదురుగా వస్తే కాటు వేస్తుంటాయి. మూగజీవాలు ఆహారం దొరికినా నీరు లేకపోతే దాహంతో అల్లాడుతుంటాయి. నీటి తొట్లు ఏర్పాటు చేస్తే వాటిని సంరక్షించిన వారవుతారు.

– అంకుషావలీ, మున్సిపల్ మేనేజర్, ఇల్లెందు

మతం మానవత్వాన్ని నేర్పాలి



మాట్లాడుతున్న షేక్ అబ్దుల్ బాసిత్

కొత్తగూడెంఅర్బన్: కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి జీవించినప్పుడే సమాజంలో సుఖసంతోషాలు, శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయని జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్, రామవరం అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. శనివారం జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో స్థానిక రామవరంలోని సుభాష్ చంద్ర బోస్‌నగర్‌లో ముస్లింల సహకారంతో జరిగిన ఈద్ మిలాఫ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ... సృష్టికర్త అయిన దేవుడు ఒక్కడే, భిన్నమతాలు, విభిన్న సాంస్కృతులకు నిలయం అయిన భారత్‌దేశంలో ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకుంటూ సుఖసంతోషాలను పంచుకుంటేనే సమాజంలో శాంతి సామరస్యాలు నెలకొంటాయన్నారు. నేడు సమాజంలో మంచి కన్నా చెడు ఎక్కువగా ప్రచారం జరుగుతోంది అని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రతీ వీధిలో మంచి విషయాలు వ్యాపింపజేయాలని కోరారు. అన్ని మతాలు మానవతా విలువలనే బోధిస్తున్నాయని వాటిని ఆచరణలో పెట్టడమే నిజమైన భక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు బాబా, కమిటీ సభ్యులు మస్తాన్, అక్బర్, జావీద్, సంజీవ్, బత్తుల శ్రీనివాస్, శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, అఫ్జల్, పర్వీన్, సభ్యులు ఫాతిమా, షేహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

23న చండీహోమం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో 23వ తేదీ పౌర్ణమి సందర్భంగా చండీహోమం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ జి.సుదర్శన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో మంగళవారం యాగశాలలో హోమం పూజలో పాల్గొనదలచిన భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామములను నమోదు చేసుకోవాలని కోరారు. పూజలో సంప్రదాయ దుస్తులు మగవారు పంచె, కండువా, మహిళలు చీరలు ధరించాలని తెలిపారు. వివరాలకు 9866923261, 6303408458 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడికి చర్యలు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో తాగునీటి ఎద్దడి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ జి.హర్షవర్ధన్ తెలిపారు. శనివారం 'ప్రభుత్వాస్పత్రిలో తాగు నీటి ఎద్దడి'శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు వివరణ కోరగా.. స్పందించిన సూపరింటెండెంట్ తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఫ్రిజ్‌లను రిపేరుకు అప్పగించినట్లు చెప్పారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్మికుల పనివేళలు మార్చండి..

ఇల్లెందు: వేసవిలో ఎండ నుంచి కార్మికులను రక్షించుకోవాలని, పనివేళలు మార్చి కార్మికులకు ఉపశమనం కలిగించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచి కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ కోరారు. శనివారం జీఎం జాన్ అనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్నాయని, ఎండ, వడగాలుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇలాంటి తరుణంలోని నిప్పుల కొలిమిలా ఉండే బొగ్గు గనుల్లో పని చేయటం ప్రాణాల మీదకు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం వెంటనే పనివేళలు మార్చి అనుకూలతలు కలిగిన సదుపాయాలు కల్పించాలని కోరారు. జీఎంను కలిసిన వారిలో బ్రాంచి ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్, కె.వెంకటేశ్వర్లు, ముస్తాఫా, సుందర్, రంజిత్, శ్రీకాంత్, సంజీవచారి, హుస్సేన్, గుగులోతు కృష్ణ తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న భూనిర్వాసితులు

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పాపకొల్లు రెవెన్యూ పరిధిలోని భూనిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. శనివారం జూలూరుపాడులో బాధితులు మాట్లాడుతూ... సీతారామ కెనాల్ నిర్మాణంతో 13 మంది రైతులకు చెందిన సుమారు 55 ఎకరాల పోడు భూమి కోల్పోయామని, ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. 2019 నుంచి నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నామని, అధికారులు కాలువ తవ్విన తరువాత ఇస్తామని చెప్పారని, ఐదేళ్లు అవుతున్నా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. పోడు భూమి పట్టాలేకపోయినా నష్టపరిహారం అందిస్తామని అధికారులు చెప్పారన్నారు. నష్టపరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని, కలెక్టర్, ఐటీడీఏ పీఓను కలవడం జరిగిందని, సమస్య పరిష్కారం కాలేదని భూనిర్వాసితులు వాపోయారు. గత ఏడాది ఇరిగేషన్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు కూడా వచ్చి జాయింట్ సర్వే చేసి వెళ్లినట్లు చెప్పారు. నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని అటవీ ప్రాంతంలో సీతారామ కెనాల్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన క్రషర్ మిల్లు పనులు అడ్డుకున్నామని అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నామని, నష్టపరిహారం ఇప్పించాలని, లేని పక్షంలో భూమి కింద భూమి ఇప్పించాలని కోరినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ తరువాత నష్టపరిహారం అందిస్తామని అధికారులు హామీ పత్రం రాసి ఇస్తే పనులు అడ్డుకోమని చెప్పామని, దీనికి అధికారులు అంగీకరించకపోవడం చర్చలు సఫలం కాలేదన్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించి తమకు నష్టపరిహారం అందేలా చూడాలని భూనిర్వాసితులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు..

కొత్తగూడెంటౌన్: అర్ధరాత్రి ఓ వ్యక్తి బైక్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం..

రుద్రంపూర్ సెయింట్ జోసఫ్ పాఠశాలలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న భద్రాచలం నెల్లిపాకకు చెందిన కె.గోపాలకృష్ణ శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వెళ్తూ రామవరంలోని గోధుమవాగు బ్రిడ్జి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కంకర కుప్ప రోడ్డుపై ఉండటంతో చీకట్లో కనిపించకపోవడంతో అదుపుతప్పి పడిపోయాడు. కంకరపై పడడంతో ముఖం, తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించారు. వారు వచ్చి ప్రథమ చికిత్స అందించి కొత్తగూడెంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ప్రస్తుతం గోపాల్ పరిస్థితి నిలకడగా ఉందని తోటి ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల్లో వార్షికోత్సవ వేడుకలు



చింతోనిచెలక అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న సీడీపీఓ తార

టేకులపల్లి: అంగన్‌వాడీలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎంతార అన్నారు. శనివారం మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చింతోనిచెలక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన వేడుకలో సీడీపీఓ పాల్గొన్నారు. మాట్లాడుతూ...

ఐదేళ్లలోపు వయస్సు కలిగిన చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్య సంరక్షణకు, ఆరోగ్యవంతమైన బిడ్డ పుట్టేందుకు అంగన్‌వాడీలు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు చెప్పారు. మహిళ గర్భం దాల్చిన నుంచి డెలివరీ అయ్యేంత వరకు కావాల్సిన పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో లభించే పోషకాల గురించి వివరించారు. అంగన్‌వాడీలో అందించే పోషకాహారాలను ప్రదర్శించారు. మండలంలో వార్షికోత్సవ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనురాధ, లక్ష్మి, సక్కుబాయి, యశోద, నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏరియాకు పూర్వవైభవం కల్పించాలి..



జీఎం శాలేంరాజుతో మాట్లాడుతున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలో రెండు సంవత్సరాల క్రితం మూతపడిన వీకే–7 షాఫ్ట్ గనికి సంబంధించి వీకే–7ఓసీ స్టేజీ–1 అనుమతులు వీలైనంత త్వరగా అనుమతులు వచ్చేవిధంగా కృషి చేసి ఏరియాకు పూర్వవైభవం కల్పించాలని కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజును ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. శనివారం జీఎం చాంబర్‌లో జీఎంతో కలిసి ఏరియాలోని కార్మికుల సమస్యలపై చర్చించారు. ప్రధానంగా జేవీఆర్ఓసీ పరిధిలోని పీవీఎస్ కాలనీ ఉద్యోగుల హెచ్ఆర్ఏ రికవరీ విషయంలో 352 క్వార్టర్స్ నిర్మాణం పూర్తి కాకముందే కార్మికులకు ఎలాట్‌మెంట్ చేయటం జరిగిందని, హెచ్ఆర్ఏ రికవరీ చేయటం సరికాదని వెంటనే క్వార్టర్ల పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. పగటి ఉష్ణోగ్రతలు కొత్తగూడెం ఏరియాలో విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఓసీలలో పనిచేసే కార్మికుల పనిగంటల్లో మార్పు తేవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జీఎం సమస్యలకు వీలైనంత త్వరలో పరిష్కార మార్గం చూస్తామని హామీ ఇచ్చారు.

కూలీలకు కనీస వేతనం ఇవ్వండి..



పని ప్రదేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

టేకులపల్లి: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స సౌకర్యాలను విధిగా కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని తుమ్మలచెలక గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సందర్శించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వేసవికాలంలో జీవనం కోసం ఉపాధి పని చేస్తున్న కూలీలకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, కూలీలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఉపాధి హామీ వేతనాలు అందలేదని వాటిని తక్షణమే కూలీల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు పనిముట్లు అందజేయాలని కోరారు. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.750 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఊకే రామకృష్ణ, చింత రవి, సువర్ణ బాక రాంబాబు, పీసం రెడ్డయ్య, బుచ్చయ్య, కోరం లక్ష్మి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తాగునీరు, నీడ ఏర్పాటు



రొంపేడులో ఏర్పాటు చేసిన షేడ్ నెట్



పూబెల్లిలో తాగునీరు, షేడ్‌నెట్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పని ప్రదేశంలో ఎట్టకేలకు కనీస సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. భానుడు ప్రతాపం చూపిస్తున్న తరుణంలో పనిప్రదేశంలో కనీస సౌకర్యాలు లేక కూలీలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ 'ఎండలు తీవ్రం.. వసతులు పూజ్యం'శీర్షికతో శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం పలు గ్రామాలలో ఉపాధి పని ప్రదేశాలలో కూలీలు సేదతీరేందుకు అవసరమైన టెంట్లు, షేడ్ నెట్లు ఏర్పాటు చేశారు. కూలీలకు ప్రత్యేకంగా తాగునీటిని సమకూర్చారు. ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులోకి తెచ్చారు. ఈ పరిణామంతో కూలీలు ఆనందం వ్యక్తం చేశారు.

కూడళ్ల అభివృద్ధిపై పట్టింపేది..?

- ఆకట్టుకోలేకపోతున్న జిల్లా కేంద్రం
- ప్రత్యేక నిధులు కేటాయించాలంటున్న పట్టణవాసులు..
- శ్రద్ధ చూపని మున్సిపల్ పాలకవర్గం, అధికారులు



సర్కిల్ నిర్మించాల్సిన బస్టాండ్ సెంటర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధి జరుగుతోంది. కానీ జిల్లా కేంద్రం కొత్తగూడెం పట్టణంలో మాత్రం అభివృద్ధి అంతంత మాత్రమే. ఈ సారి మున్సిపల్ పాలకవర్గం ఎన్నికలు జరిగినప్పటి నుంచి కౌన్సిల్ సభ్యులు వర్గాలుగా విడిపోవడం, కొట్లాటలు, కుమ్ములాటలు, కమీషన్ల కక్కుర్తితో అంతా అడ్డాదారులు తొక్కారు. పట్టణంలో అభివృద్ధి, ప్రజల సౌకర్యాలను పట్టించుకోవడం లేదు. దీంతో జిల్లా కేంద్రంలో అభివృద్ధి వెనకబడే ఉందని చెప్పొచ్చు. అందులో భాగంగా కొత్తగూడెం పట్టణంలో మొత్తం ఆరు ప్రధాన కూడళ్లు ఉన్నాయి. ఆయా కూడళ్లల్లో సర్కిల్లు ఏర్పాటు చేసి ప్రయాణీల సమాచారం కొరకు ఊరి పేరు, కిలోమీటర్లతో కూడిన నేమ్ బోర్డుల ఏర్పాటు చేయాల్సి ఉంది. కూడళ్లలో ఆకట్టుకునే, ఆకర్షణీయమైన మొక్కలను పెంచాలి. పట్టణంలో ప్రధానంగా పాతబస్‌డిపో సెంటర్, గణేష్ టెంపుల్ వద్ద ఉన్న మరో కూడలి, సూపర్‌బజార్ సెంటర్‌ను, చిన్నబజార్, పెద్దబజార్ సెంటర్లను కలుపుతూ, రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గాలను కలుపుతూ ఏర్పడిన కూడలి, బస్టాండ్ సెంటర్ కూడలి, పోస్టాఫీసు సెంటర్ కూడలి, హెడ్డాఫీసు సెంటర్ కూడలిలను మున్సిపల్ అధికారులు గుర్తించి ఆయా కూడళ్లలో సర్కిళ్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాకుండా అందమైన, ఆకర్షణీయమైన పూలమొక్కలు, వాటర్ ఫౌంటేన్, ఆకట్టుకునే బొమ్మలు, మేధావుల విగ్రహాలను ఏర్పాటు చేస్తే పట్టణం ఆకర్షణీయంగా ఉంటుంది. ప్రధాన కూడళ్లలో సర్కిల్లు ఏర్పాటు చేయడం వలన ప్రమాదాల సంఖ్య కూడా కొంత తగ్గే అవకాశం ఉంటుంది. ఈ సర్కిళ్ల ఏర్పాటు చేయడానికి మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

నిర్వహణ లేక వెలవెల..

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో పేరుకు మాత్రమే ఒక్క పోస్టాఫీసు సెంటర్‌లో నామమాత్రంగా సర్కిల్ ఉంది. అందులో మున్సిపల్ వారి నిర్వహణ లేక ఉన్న మొక్కలు ఎండిపోతుండగా, అక్కడే ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం సైతం శుభ్రం చేసేవారు లేరు. కొత్తలో ఫౌంటేన్ కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది పని చేయడం లేదు. పట్టణంలో అవసరమున్న కూడళ్లలో సర్కిళ్లు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోని ఆజెండాలో నిధులు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా సర్కిళ్ల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్రం కొత్తగూడెం మున్సిపాలిటీలో ఉంటే, పక్కన ఉన్న లక్ష్మీదేవిపల్లి మండలం, చుంచుపల్లి మండలం, నవభారత్, పాల్వంచ ఏరియాలలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. మున్సిపాలిటీలో అభివృద్ధి జరగాలంటే కౌన్సిల్ సభ్యులు ఐక్యంగా అభివృద్ధికి అడుగులు వేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



నిర్వహణ లేని పోస్టాఫీసు సెంటర్ సర్కిల్

చర్యలు తీసుకుంటాం...



కొత్తగూడెం పట్టణ పరిధిలో అభివృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటాం. పోస్టాఫీసు సెంటర్ సర్కిల్‌లో ఉన్న వాటర్ ఫౌంటెన్ పనిచేసే విధంగా చూస్తాం. మిగతా సెంటర్లలో సర్కిళ్ల ఏర్పాటు అంశాన్ని పరిశీలన చేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తాం.

– శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్